
సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 24 । జూలై । 2023



రేపు జీవీఎంసీ కౌన్సిల్

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరగనుంది. 8లో



ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ 8లో

ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు పొందిన ఎంపీసీ విభాగం విద్యార్థులకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.



కొత్తకార్డులు వస్తున్నాయ్.!

రైస్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు సిద్ధమవుతోంది. 8లో

న్యూస్‌రీల్

నేడు జగనన్నకు చెబుదాం, డయల్ యువర్ మేయర్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. 1800 4250 0009 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను నేరుగా మేయర్ దృష్టికి తీసుకెళ్లొచ్చు. ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుంది. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

అన్నవరంలో ఏపీటీడీసీ చైర్మన్ వరప్రసాదరెడ్డి



ఒబెరాయ్ హోటల్స్‌గ్రూప్ భూమిపూజ చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న వరప్రసాదరెడ్డి

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం తీరంలో ఒబెరాయ్ హోటల్ గ్రూప్ రూ.350 కోట్లతో 40 ఎకరాలలో నిర్మించనున్న స్టార్ హోటల్ ప్రదేశాన్ని ఆదివారం ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ ఆరిమండ వరప్రసాదరెడ్డి సందర్శించారు. లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న వర్చువల్ విధానంలో భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భూమి పూజ చేసిన ప్రదేశంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలను ఆయన పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు.

బీఎస్ రావుకు ఘన నివాళి



బీఎస్ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కొమ్మాది(భీమిలి): శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు విద్యా రంగానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. ఇటీవల మృతి చెందిన బీఎస్ రావు సంతాప సభను ఆదివారం కొమ్మాదిలోని శ్రీచైతన్య కాలేజీలు, స్కూల్ బ్రాంచిల ఆధ్వర్యంలో భగీరథ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రావు చిత్ర పటానికి మంత్రి అమర్‌నాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మంచి వ్యక్తిత్వం, మానవత్వం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎల్ నర్సింహారావు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, ఆర్‌ఐవో సత్యనారాయణ, ఫైర్ ఆర్‌ఎఫ్‌వో నిరంజన్‌రెడ్డి, వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య భాగ్యం



గతంలో వైద్యం కోసం ఇబ్బంది పడేవాళ్లం. జ్వరం వచ్చినా చాలా దూరం వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముంగిట్లో వైద్య సౌకర్యాలు సమకూరాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. ఇటీవల సుగర్ పరీక్ష చేయించుకున్నా. గతంలో సుగర్ పరీక్ష చేయించుకోవాలంటే చాలా దూరం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు యూపీహెచ్‌సీల్లో వైద్య సేవలతో పాటు మందులూ ఉచితంగా ఇవ్వడం మాలాంటి వాళ్లకు ఎంతో ఉపశమనం కలిగిస్తోంది.

\- పి.నారాయణమ్మ, కుమ్మరివీధి



ఇదీ మార్పు

వైద్యం అందరికీ అందాలి. ప్రజలకు మరింత చేరువకావాలి. ఇదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం. గతంలో మాదిరిగా వైద్యం కోసం మైళ్ల దూరం వెళ్లాల్సిన పనిలేదు. ముంగిట్లోనే వైద్యం అందించేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) ప్రవేశపెట్టారు. ప్రజల ఆరోగ్యానికి యూపీహెచ్‌సీలు భరోసా నిలుస్తున్నాయి.

\- మహారాణిపేట(విశాఖ దక్షిణ)



యూపీహెచ్‌సీని సందర్శించి అక్కడ రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

- సత్ఫలితాలిస్తున్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- నగరంలో 63 యూపీహెచ్‌సీల ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్యం

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దడంతో పాటు, ప్రజలకు వైద్యాన్ని చేరువ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. యూపీహెచ్‌సీల ద్వారా మెరుగైన వైద్యం అందుతోంది. జీవీఎంసీ పరిధిలో 63 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీలు)ఉన్నా యి. వీటిలో 39 యూపీహెచ్‌సీలకు సొంత భవనాలు ఉన్నాయి. ఆరు భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 18 యూపీహెచ్‌సీ కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సేవలు అందిస్తున్నాయి. గత ఏప్రిల్ నుంచి జులై 22 వరకు ఈ యూపీహెచ్‌సీల్లో 8,820 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. యూపీహెచ్‌సీలు ప్రజలకు దగ్గరగా ఏర్పాటు చేయడం వల్ల సకాలంలో వైద్య సేవలందుతున్నాయి. సకాలంలో ఆస్పత్రికి చేరడం వల్ల రోగి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చు. అంతేకాకుండా సీజనల్‌గా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులను జిల్లా ఆస్పత్రి వరకు వెళ్లనవరం లేదు. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం చేయించుకోవచ్చు. యూపీహెచ్‌సీకి వచ్చే రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు అందజేస్తున్నారు. ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేయడంలో భాగంగా వార్డుకు ఒక యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేసి వైద్యులను, ఇతర సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. 63 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు పేద ప్రజలకు అందిస్తున్నారు.



యూపీహెచ్‌సీలో జిల్లా అధికారులు

రోజుకు సరాసరి వచ్చే రోగులు	
35 నుంచి 40	
సోమవారం	
60 మంది వరకు	
ఎన్ని పరీక్షలు నిర్వహిస్తారు 63	మందులు 173 రకాలు



యూపీహెచ్‌సీలో రోగికి వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలు

సంపూర్ణ వైద్యం



పేద ప్రజలకు సంపూర్ణ వైద్యం అందించేందుకు యూపీహెచ్‌లను అందుబాటులోకి తెచ్చాం. పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా యూపీహెచ్‌లు ఉన్నాయి. అక్కడ వైద్యుడు, ఇతర సిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

\- డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, విశాఖపట్నం

శరవేగంగా సొంత భవనాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పరిధిలో యూపీహెచ్‌సీలకు సొంత భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. వీటికి అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. పట్టణ ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసింది. అన్ని రకాల వైద్య సేవలు, పరీక్షలు, మందులు అందజేస్తున్నాం.

\- డాక్టర్ రామారెడ్డి, నోడల్ అధికారి, వైద్య ఆరోగ్యశాఖ, విశాఖపట్నం

ఉచితంగా పరీక్షలు



జ్వరం వచ్చి తగ్గుతోంది. పలు ప్రాంతాల్లో వైద్యులకు చూపించా... అయినా తగ్గలేదు. రెల్లి వీధి యూపీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించా... కొన్ని పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. చివరకు ఇప్పుడు జ్వరం రావడం లేదు. నేను ఇక్కడే నివాసం ఉండడం వల్ల యూపీహెచ్‌సీలో వైద్యం చేయించుకుంటున్నాను. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ నిత్యం సేవలందిస్తున్నారు. - రెయ్యి డేవిడ్ రాజు, రెల్లివీధి ఏరియా

అందుబాటులో వైద్యులు



గతంలో యూపీహెచ్‌సీ ఉండేది కాని.. వైద్యులు, మందులు ఉండేవికావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. మందులు ఉచితంగా ఇస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా మంచి నిర్ణయం తీసుకున్నారు.

\- కేశరపు వాసు, జాలారిపేట, 37వ వార్డు

సేవలు బాగున్నాయి



వయసు పెరుగుతోంది. వైద్యం కోసం ఎక్కడెక్కడకో వెళ్లాలంటే కాళ్లురావడం లేదు. పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ఆ సమస్య తీరింది. అందుబాటులో ఆస్పత్రి..వైద్యులు, మందులు ఉన్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు బాగున్నాయి. అత్యవసర చికిత్సలు అవసరమైతే 104,108 వాహనాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ వాహనాల ద్వారా రాత్రి సమయంలో కూడా పెద్ద ఆస్పత్రులకు తీసుకొని వెళుతున్నారు.

\- కాకి కనకమహాలక్ష్మి, అల్లిపురం



వర్షం నీటిలో రైల్వే స్టేషన్ ప్రాంగణం

ముంచెత్తిన వాన 8లో

గిరిజనుల జీవన సౌందర్యం అమోఘం

- ఉపముఖ్యమంత్రి రాజన్నదొర
- ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాలు



గిరిజన చిత్రాలను వీక్షిస్తున్న యువతులు



కళాకారులతో నృత్యం చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి

బీచ్‌రోడ్డు: గిరిజనుల జీవన సౌందర్యం అమోఘమని ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గిరిజనోత్సవం ముగింపు వేడుకలను ఆదివారం వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించారు. గిరిజన సాంస్కృతి సంప్రదాయలు కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని రాజన్నదొర పేర్కొన్నారు. ఈ ఏడాది జరగబోయే ఆదివాసీ దినోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రపంచానికి జీవన శైలి, వారి పండగలు, ఆహార అలవాట్లను తెలుసుకునేందుకు ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్ టీఎం మిషన్ డైరెక్టర్ రవీంద్రబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులతో నృత్యం చేసిన రాజన్న

గిరిజన ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ గిరిజన ప్రాంతాలకు చెందిన కళాకారులతో డిప్యూటీ సీఎం రాజన్న దొర, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి నృత్యం చేసి అలరించారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

భీమునిపట్నం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ తమ వంతు కృషి చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి అన్నారు. ఇక్కడ సెడార్ పాఠశాలలో మూడు జిల్లాల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు, పాఠశాలల అభివృద్ధిపై నిర్వహించిన 5 రోజులు శిక్షణ ఆదివారం ముగిసింది.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని దానికి తగిన విధంగా ప్రధానోపాధ్యాయుల కృషికూడా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక



విజేతలతో పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల కోసం రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. హిమ ప్రభాస్, అభినవ్, సోహన్ గౌతమ్, అతిక్ష, ప్రేరణ, మైత్రి, విద్యశ్రీ, పురందరి, కార్తీక్, వైభవ్, పూజిత్ వీర్, చేతన్ శివాశిష్, లలిత్ రాంచరణ్, బోనీ అశ్వద్, లాస్య, అభినయ్, శౌరీ, జైదీప్, మణికంఠ, రణదీర్, తేజ, ధార్మిక్, శ్రేయాస్, ధరహాస్, సాయికైలేష్, పి.కీర్తి, సంజన, శ్రీమయ్, శ్యామ్ గణేష్, అజిత్, సనూతి తదితరులు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు పాఠశాల సీఈవో నిశాంత్, ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, యూఎస్ఎఫ్ఏ రాష్ట్ర కార్యదర్శి పి.బాలాజీ, డీఎఫ్‌వో మంగమ్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు బంగారు, వెండి, కాంస్య పతకాలు అందించారు.

అర్హులకు ఓటు హక్కు తప్పనిసరి



ఓటు నమోదు గురించి మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

- కలెక్టర్ మల్లికార్జున
- 9వ వార్డులో ఓటరు సర్వేపై ఆరా

ఆరిలోవ(విశాఖ తూర్పు): అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రాంతం సంజీవినగర్‌లో ఆదివారం బీఎల్‌వోలతో కలిసి ఆయన పర్యటించారు. ఇక్కడ 82, 83 బూత్‌ల పరిధిలో బీఎల్‌వోలు చేసిన ఇంటింటి ఓటరు సర్వేలో కలెక్టర్ నేరుగా పాల్గొని స్థానికులతో మాట్లాడారు. అద్దె ఇళ్లల్లో గతంలో ఉండే వారి వివరాలు, కొత్తగా నివాసం ఉంటున్నవారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు, కొత్తగా ఓటు నమోదు చేసే విషయంలో బీఎల్‌వోలు పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి ఓటరు సర్వే చేపడుతున్న తీరు గురించి బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య, బూత్ లెవెల్ ఏజెంట్లు, బీఎల్‌వోలు వెంపాడ శ్రీనివాసరెడ్డి, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకార్డులు వస్తున్నాయ్.!


రైస్‌కార్డులు

- పంపిణీకి సిద్ధమవుతున్న ప్రభుత్వం
- 4,312 మందికి కార్డుల జారీ
- సురక్ష క్యాంపుల ద్వారా పరిశీలనలో మరో 1,500కి పైగా దరఖాస్తులు
- జిల్లాలో ప్రస్తుతం 5.21 లక్షల కార్డుదారులు

సాక్షి, విశాఖపట్నం : రైస్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దరఖాస్తు చేసుకుని అర్హత కలిగిన వారందరికీ లబ్ధి చేకూర్చేందుకు సిద్ధమవుతోంది. తహసీల్దార్ల డిజిటల్ సంతకాల ప్రక్రియ పూర్తి కావడంతో కార్డుల ముద్రణ ప్రక్రియ జరుగుతోంది. జిల్లాలో కొత్తగా 4,312 మందికి రైస్ కార్డులు అందించనున్నారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా వచ్చిన 1500కి పైగా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. పోషకాలు ఉండే నాణ్యమైన(సార్టెక్స్) బియ్యాన్ని ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే అందించడంతో ప్రతి నెలా రేషన్ తీసుకువారి సంఖ్య పెరుగుతోంది. ఏప్రిల్ నుంచి జీవీఎంసీ పరిధిలో గోధుమ పిండి పంపిణీని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కార్డులకు మాత్రమే రేషన్ ఇస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం నాన్-ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డుదారులకు సైతం రేషన్ సరఫరా చేస్తూ పేదలకు అండగా నిలుస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 5.21 లక్షల కార్డులకు 15.37 లక్షల మంది లబ్ధిదారులున్నారు. కొత్త కార్డుల మంజూరు ద్వారా అదనంగా 13 వేల మందికి లబ్ధి చేకూరనుంది.

కొత్తగా 4,312 రైస్‌కార్డుల మంజూరు

ప్రభుత్వం ఏటా రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో కొత్త కార్డులు జారీ చేస్తోంది. ఇప్పటి వరకు జిల్లా పరిధిలో కొత్తగా 4,312 రైస్ కార్డులకు ఆమోదం లభించింది. తహసీల్దార్ల డిజిటల్ సంతకాల ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగిసింది. ప్రస్తుతం కార్డుల ముద్రణ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. కార్డులు సిద్ధమైన తర్వాత సచివాలయాల వారీగా వలంటీర్ల ద్వారా ఇంటింటికీ రైస్ కార్డుల్ని పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం మంజూరు చేసిన కార్డులతో పాటు ఇటీవల జగనన్న సురక్షలో బియ్యం కార్డుల కోసం అనేక దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకూ సురక్ష క్యాంపుల ద్వారా మొత్తం 1500 కిపైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 26వ తేదీ వరకూ క్యాంపులు నిర్వహించనున్నారు. మిగిలిన ప్రాంతాల నుంచి కూడా దరఖాస్తులు అందిన తరువాత వాటి పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. వీరిలో అర్హులకు కూడా బియ్యం కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మండలాల వారీగా మంజూరైన కార్డుల వివరాలివీ..

మండలం	ప్రస్తుతం బీపీఎల్ కార్డులు	కొత్తగా మంజూరైన కార్డులు	మొత్తం కార్డులు
ఆనందపురం	20,020	269	20,289
భీమునిపట్నం	34,879	311	35,190
సర్కిల్-1(అర్బన్)	1,56,166	1285	1,57,451
సర్కిల్-2(అర్బన్)	1,49,735	1266	1,51,001
సర్కిల్-3(అర్బన్)	1,33,146	943	1,34,089
పద్మనాభం	16,960	140	17,100
పెందుర్తి	10,420	98	10,518
మొత్తం	5,21,326	4,312	5,25,638

బయోమెట్రిక్ వేసిన వెంటనే రేషన్‌కు అర్హులు



సచివాలయాలకు కార్డుల ముద్రణకు కావల్సిన ఖాళీ రైస్ కార్డుల్ని పంపిణీ చేశాం. సచివాలయాల్లో ముద్రణ ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే వలంటీర్ల ద్వారా అందజేస్తాం. లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ తీసుకోగానే కార్డు యాక్టివేట్ అవుతుంది. అప్పటి నుంచి రేషన్ తీసుకునేందుకు కొత్త కార్డుదారులు అర్హులుగా పరిగణిస్తాం. రేషన్ తీసుకోకుంటే కార్డు రద్దు అవుతుందనే ఆందోళనతో కొందరు ప్రతి నెలా సరకులు తీసుకుని దళారులకు విక్రయిస్తున్నారు. దీన్ని అరికట్టేందుకు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వీడియో సందేశం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎండీయూ వాహనాల ద్వారా కూడా ప్రచారం చేస్తున్నాం. ప్రభుత్వం కిలోకు రూ.40 చొప్పున ఖర్చు చేస్తూ పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ఇంత ఖరీదైన బియ్యాన్ని వృథా చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం.

– జి.సూర్యప్రకాష్‌రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

డాక్టర్ నిర్లక్ష్యానికి బాలిక బలి

- ఐదేళ్ల చిన్నారికి రివర్స్ వైద్యం
- లోటస్ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం
- కన్నవారి ఎదుటే కన్నుమూసిన స్కందన
- మృతురాలు వైద్య దంపతుల కుమార్తె
- పోలీస్ కమిషనర్, డీఎంహెచ్‌వోలకు ఫిర్యాదు


కృష్ణ స్కందన మృతదేహం

సాక్షి, విశాఖపట్నం: ఐదేళ్ల పాపకు కడుపు నొప్పిగా ఉండడంతో తల్లిదండ్రులు నగరంలోని లోటస్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఐదు రోజుల తర్వాత ఆమె పరిస్థితి విషమించింది. ఆపై ఫిట్స్ రావడంతో కోమాలోకి వెళ్లిపోయింది. అనంతరం మరణించింది. ఆ ఆస్పత్రి డాక్టర్ల నిర్లక్ష్యానికి, రివర్స్ వైద్యానికి తమ కుమార్తె బలైపోయిందని వైద్యులైన బాలిక తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. లేకలేక పుట్టిన తన ఏకైక గారాల పట్టిని డాక్టర్లు పొట్టనబెట్టుకున్నారని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ చిన్నారి తల్లి నగర పోలీస్ కమిషనర్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి ఫిర్యాదు చేశారు. వైద్యుల నిర్లక్ష్యంపై సాటి డాక్టర్లు ఫిర్యాదు చేయడం విశాఖ వైద్య చరిత్రలో ఇదే తొలిసారని చెబుతున్నారు.

అక్కయ్యపాలెంలో ఉంటున్న డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, డాక్టర్ శిరీష దంపతుల ఏకైక కుమార్తె ఏసీ కృష్ణ స్కందన (5) ఓ స్కూలులో ఒకటో తరగతి చదువుతోంది. బాలికకు కడుపు నొప్పి రావడంతో మే 29న సిరిపురంలోని లోటస్ ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. ఆస్పత్రిలో పిల్లల వైద్యుడు మురళీ సంతోష్ బుద్ధా నేతృత్వంలో వైద్యమందించారు. రెండో రోజు కడుపు నొప్పి తగ్గిపోయింది. వైద్య పరీక్షల్లో చిన్నారికి సోడియం స్థాయి తక్కువగా ఉన్నట్టు తేలింది. బాలిక ఆరోగ్యం మెరుగుపడకపోగా మరింత క్షీణించడం మొదలైంది. దీంతో అనుమానం వచ్చి వైద్యులైన ఆ తల్లిదండ్రులు తమ పాపకు అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. పాపకు సోడియం లెవల్స్ పెంచడానికి బదులు తగ్గేందుకు రివర్స్ వైద్యం అందిస్తున్నట్టు గుర్తించారు. ఇదే విషయాన్ని చికిత్స అందిస్తున్న మురళీ సంతోష్ దృష్టికి పలు మార్లు తీసుకెళ్లారు. అయితే పిల్లల వైద్య నిపుణుడిగా తనకు అంతా తెలుసని చెబుతూ, తమ అభ్యర్థనను పట్టించుకోకుండా అదే వైద్యాన్ని కొనసాగించారని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. దీంతో తమ బిడ్డకు తొలుత ఫిట్స్ వచ్చిందని, అనంతరం కోమాలోకి వెళ్లిపోయి జూన్ 3న చనిపోయిందని పోలీస్ కమిషనర్, డీఎంహెచ్‌వోలకు ఇచ్చిన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. కాగా వైద్యుల నిర్లక్ష్యంపై సాటి డాక్టర్లు ఫిర్యాదు చేయడం విశాఖలో ఇదే తొలిసారి కావడం విశేషం.

త్రీటౌన్ స్టేషన్‌లో కేసు నమోదు

బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ కేసు నమోదు చేయాలని మూడో పట్టణ పోలీసులను ఆదేశించారు. దీంతో త్రీటౌన్ పోలీసులు లోటస్ ఆస్పత్రిపై కేసు నమోదు చేశారు. తనకు అందిన ఫిర్యాదుతో బాలిక కృష్ణ స్కందన మృతిపై సమగ్ర విచారణకు వైద్య నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సిఫార్సు చేసినట్టు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు 'సాక్షి'కి చెప్పారు.

విచారణకు కమిటీ ఏర్పాటు

బాలిక మృతి ఘటనపై విచారణకు కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ నిపుణుల కమిటీని నియమించారు. ఇందులో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాధాకృష్ణ, ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ పద్మజ ఉన్నారు. సత్వరమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్ కమిటీని ఆదేశించారు.

మరెవరికీ ఇలా జరగకూడదు

కేవలం లోటస్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ ఏకైక చిన్నారి బలైపోయిందంటూ తల్లిదండ్రులు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శిరీష కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రాణాంతకం కాని కడుపు నొప్పికి రివర్స్ వైద్యం అందించి తమ బిడ్డను పొట్టనబెట్టుకున్నారని, ఎన్నో ఏళ్ల తర్వాత కలిగిన ఏకైక సంతానం కృష్ణ స్కందన తమ కళ్లెదుటే కన్నుమూయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామంటూ రోదిస్తున్నారు. డాక్టర్ వెంకటేశ్వరరావు ఓ ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రిలో హృద్రోగ నిపుణుడిగా, డాక్టర్ శిరీష గైనకాలజిస్టుగా పని చేస్తున్నారు. తమకు జరిగిన అన్యాయం మరే తల్లిదండ్రులకు జరగకూడదన్న ఉద్దేశంతోనే ఫిర్యాదు చేస్తున్నామని 'సాక్షి'కి చెప్పారు. తమ చిన్నారి మృతికి కారణమైన లోటస్ ఆస్పత్రి పిల్లల వైద్యుడు మురళీ సంతోష్ సహా బాధ్యులైన వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ మరళీ సంతోష్‌ను వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అంధుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా తిరుమల ప్రసాద్



కొమ్మాది: బీచ్‌రోడ్డులోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా జి.తిరుమల ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహేశ్‌రెడ్డికి విజయనగరం బదిలీ అయింది. పాఠశాల అభివృద్ధికి, అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని తిరుమల ప్రసాద్ చెప్పారు.

చిన్నారి హత్య కేసులో నిందితుల అరెస్ట్

కూర్మన్నపాలెం: కూతురు అల్లరి చేసిందనే నెపంతో గరిటెతో కొట్టి తల్లి హత్య చేసిన ఘటనలో.. ఆమెకు సహకరించిన ప్రియుడు నిమ్మకాయల రమణబాబును దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 17న గీతశ్రీ అల్లరి చేస్తుండటంతో ఆమె తల్లి స్నేహ గరిటెతో చిన్నారి తలపై కొట్టడంతో స్పృహ కోల్పోయింది. అక్కడే ఉన్న రమణబాబు చిన్నారిని గోడకు కొట్టడంతో తలలో భాగాలు బయటకు వచ్చేశాయి. దీంతో అదే రోజు రాత్రి ఇంటి వెనుక ఉన్న ముళ్ల పొదల్లో గొయ్యి తీసి చిన్నారి మృతదేహాన్ని పూడ్చేశారు. ఈ సంఘటనలో నిందితురాలిని శనివారం అరెస్ట్ చేయగా.. నిందితుడు రమణబాబు పరారీలో ఉండడంతో ఆదివారం కాకినాడలో అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ విచారించి.. కోర్టులో హాజరుపరిచినట్టు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

మురళీనగర్: ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు పొందిన ఎంపీసీ విభాగం విద్యార్థులకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని, ఏమైనా సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ కేంద్రాలకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

ఇదీ షెడ్యూలు

- **రిజిస్ట్రేషన్/ప్రాసెసింగ్ ఫీజులు చెల్లింపు గడువు:** ఈ నెల 24 నుంచి ఆగస్టు 3వ తేదీ
- సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 25 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు హెల్ప్‌లైన్ కేంద్రాల్లో నిర్వహిస్తారు.
- **వెబ్ ఆప్షన్ల నమోదు:** ఆగస్టు 3 నుంచి 8 తేదీ వరకు
- **వెబ్ ఆప్షన్ల మార్పిడి:** ఆగస్టు 9వ తేదీ
- **సీట్ల కేటాయింపు:** ఆగస్టు 12
- **సెల్ఫ్ రిపోర్టింగ్ లేదా రిపోర్టింగ్ ఎట్ కాలేజీస్:** ఆగస్టు 13, 14 తేదీలు.

రిజిస్ట్రేషన్ ఇలా..

https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ ఎంటర్ చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం ఓపెన్ అవుతుంది. అందులో వివరాలు నింపి డిక్లరేషన్ సబ్‌మిట్ చేస్తే రిజిస్ట్రేషన్ ఫీజు పేమెంట్ విండో వస్తుంది. ఎస్సీ/ఎస్టీలకు రూ.600లు, ఇతరులకు రూ.1200లు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

వెబ్ కౌన్సెలింగ్‌కు అవసరమైన సర్టిఫికెట్లు

ఏపీఈఏపీసెట్ ర్యాంక్ కార్డు, ఏపీఈఏపీసెట్ హాల్ టికెట్, ఇంటర్ మార్కుల మెమో, పుట్టిన తేదీ ధ్రువపత్రం(టెన్త్ మార్కుల లిస్ట్), టీసీ, 6 నుంచి ఇంటర్ స్టడీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఫర్ ఓసీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, మైగ్రేటెడ్ విద్యార్థులకు లోకల్ స్టేటస్ సర్టిఫికెట్.

ప్రత్యేక కేటగిరి కౌన్సెలింగ్

- ఈ నెల 30న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 1–50000
- ఈ నెల 31న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 50001–90000, క్యాప్స్ 1–40000
- ఆగస్టు 1న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 90001–140000, క్యాప్స్ 40001–900000
- ఆగస్టు 2న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 140001–చివరి ర్యాంకు, క్యాప్స్ 90001–చివరి ర్యాంకు
- ఆగస్టు 3న పీహెచ్‌వీ/పీహెచ్‌హెచ్/పీహెచ్‌వో/ఆంగ్లో ఇండియన్/స్కౌట్స్ అండ్ గైడ్స్ 1 నుంచి చివరి ర్యాంకు వరకు

వీరంతా షెడ్యూల్ ప్రకారం విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాల్సి ఉంటుంది.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను 0891–2562977కు ఫోన్ చేసి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లొచ్చు.

రేపు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం


జీవీఎంసీ కౌన్సిల్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 25న ప్రధాన కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరగనుంది. కౌన్సిల్ సమావేశంలో 44 అంశాలు పొందుపరిచారు. మరో 41 సప్లిమెంటరీ అంశాలు ఆ రోజున కౌన్సిల్‌కు చర్చకు రానున్నాయి. సప్లిమెంటరీ అంశాలను పరిశీలిస్తే.. కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లో 24.20 ఎకరాల్లో రూ.43.80 కోట్లతో ఘన వ్యర్థాలను బయో మైనింగ్ చేసేందుకు పరిపాలన ఆమోదం, పరిపాలన విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను 2023–2024 ఆర్థిక సంవత్సరానికి కొనసాగించడం, ఆప్కోస్ ద్వారా వారికి వేతనం చెల్లించేందుకు అంచనా వ్యయం రూ.3,86,50,000కు పరిపాలన ఆమోదం, రూ.1.98 కోట్లతో సింహాచలం ఆర్టీసీ డిపో నుంచి అడవివరం జంక్షన్ వరకు రోడ్డుకి పడమర వైపున వరద నీటి కాలువ నిర్మాణం, రూ.9.92 కోట్లతో కుమ్మరవీధి నుంచి అడవివరం జంక్షన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం, రూ.1.96కోట్లతో సింహాచలం ఆర్టీసీ డిపో నుంచి అడవివరం జంక్షన్ వరకు తూర్పు వైపున వరద నీటి కాలువ నిర్మాణం, రూ.11.35 కోట్లతో పాత గోశాల జంక్షన్ నుంచి తొలి పావంచా వరకు బీటీ రోడ్డు నిర్మాణం, రూ.7.36 కోట్లతో తొలి పావంచా నుంచి కుమ్మరవీధి వరకు బీటీ రోడ్డు నిర్మాణం విషయమై పరిపాలన అనుమతికై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంపై కౌన్సిల్‌లో చర్చ జరగనుంది. అలాగే రూ.1.68 కోట్లతో అనకాపల్లి జోన్ 80 నుంచి 84వ వార్డులోని సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారద బ్రిడ్జి వరకు ఫుట్‌పాత్, సెంట్రల్ మీడియన్ నిర్మాణం, మరమ్మతులు, రూ.1.93 కోట్లతో అనకాపల్లి జోన్ సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారద బ్రిడ్జి వరకు బీటీ రోడ్డు విస్తరణ, రూ.98 లక్షలతో అనకాపల్లి జోన్ 83వ వార్డులో పెరుగు బజార్ జంక్షన్ అభివృద్ధి, రూ1.4 కోట్లతో పెరుగు బజార్ జంక్షన్‌లో ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణం, రూ.1.19 కోట్లతో అనకాపల్లి జోన్ 80వ వార్డులో జాతీయ రహదారి 16 నుంచి రాజుపాలెం గ్రామం వరకు బీటీ రోడ్డు విస్తరణ, రూ.1.41 కోట్లతో 82వ వార్డు నెహ్రూ చౌక్ జంక్షన్ నుంచి గుండాల జంక్షన్ వరకు బీటీ రోడ్డు విస్తరణ, రీలేయింగ్, ఫుట్‌పాత్ నిర్మాణం, రూ.89.75 లక్షలతో 41వ వార్డు ఎర్రిగెడ్డ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి ఆర్ అండ్ డీ యార్డ్ వరకు వరద నీటి కాలువ ఆపరేషన్, నిర్వహణ, పాతనగరం జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ క్వీన్ విక్టోరియా విగ్రహం జంక్షన్ వరకు 60 అడుగుల ప్రతిపాదిత రోడ్డు విస్తరణ, ఇరువైపులా వరద నీటి కాలువలు, కాలిబాటలు, సెంట్రల్ మీడియన్ ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులకు సంబంధించి పరిపాలన ఆమోదానికి కౌన్సిల్ చర్చించనుంది.

ముంచెత్తిన వాన

- మధురవాడలో 10.6 సెం.మీల వర్షపాతం
- నగరంలో పలుచోట్ల కుండపోత
- రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జన జీవనం
- నేడు, రేపు భారీ వర్షాలకు ఆస్కారం


భారీ వర్షంతో రోడ్డుపైకి చేరిన వరదనీరు

వర్షపాతం వివరాలు ఇలా (సెం.మీలలో)

ప్రాంతం	వర్షపాతం
జాతర	10.6
బింద్రానగర్	10.2
సాగర్‌నగర్	9.1
జూపార్కు	7.4
అక్కిరెడ్డిపాలెం	6.0
వుడా పార్కు	5.8
పెదవాల్తేరు	5.7
పెందుర్తి	5.1
కాపులుప్పాడ	4.2
సింహాచలం	4.2
చావులమదుం	4.0

సాక్షి, విశాఖపట్నం: నగరాన్ని వాన ముంచెత్తింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నగరం నలుమూలలా దంచి కొట్టింది. ఇటీవల రోజుల్లో ఇంతలా భారీ వర్షం కురవడం ఇదే తొలిసారి. ఈ జోరు వానకు నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీటిలో గోతులు కనిపించకుండా పోయాయి. దీంతో కొంతమంది వాహన చోదకులు వాటిలో పడ్డారు. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. వదలకుండా కురిసిన వర్షానికి నగర జీవనం స్తంభించింది. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గినా చాలా వరకు ట్రాఫిక్ గాడిలో పడలేదు. సాయంత్రం విధుల నుంచి ఇళ్లకు చేరుకునే ఉద్యోగులు, వివిధ పనులపై బయటకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. రాత్రి ఏడున్నర గంటల తర్వాత వాన తెరపినివ్వడంతో జనం కాస్త ఊరట చెందారు. ముసురులాంటి వర్షానికి కొంతమంది వ్యాపారులు, రోడ్ల పక్కన చిల్లర వర్తకులు ముందుగానే తమ దుకాణాలను మూసివేసుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. నగరంలో మధురవాడలో అత్యధికంగా 10.6 సెం.మీల వర్షపాతం నమోదైంది. మరోవైపు విశాఖలో సోమ, మంగళవారాల్లోనూ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని ఐఎండీ తెలిపింది.


ఇస్కాన్ సమీపంలో స్తంభించిన ట్రాఫిక్


వర్షంలో బైకర్ పాట్లు




గ్రేటర్‌లో ఏసీపీల బదిలీలు

అల్లిపురం: రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఏసీపీలను బదిలీ చేస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జిల్లాకు సంబంధించి పలువురు ఏసీపీలకు బదిలీలు జరిగాయి. ఆగస్టు 1 నుంచి బదిలీలు అమలవుతాయని డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
ఎస్.బాపూజీ	ఎస్సీ,ఎస్టీ సెల్-1	సీఐడీ
వై.గోవిందరావు	సిటీ స్పెషల్ బ్రాంచ్ (రెగ్యులర్)	సిటీ స్పెషల్ బ్రాంచ్ (సివిల్)
డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి	సబ్ డివిజనల్ ఆఫీసర్, ఈస్ట్ సర్కిల్(రెగ్యులర్)	అదే స్థానం(సివిల్)
జి.రాజీవ్‌కుమార్	ట్రాఫిక్	విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్
ఎ.త్రినాథరావు	టాస్క్‌ఫోర్స్	విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్
ఎ.వెంకటరావు	సీసీఎస్	స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే విధంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దిపాలెంలో నిర్వహిస్తున్న 3వ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం వలన ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిగా ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించేవారికి తన వంతు సాయం చేస్తానని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి సుమారు 400 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. వయసుల వారీగా పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మందికి బంగారు పతకాలు బహూకరిస్తామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఆనందబాబు, కార్యనిర్వాహక కారదర్శి వాసుపల్లి శ్రీహరి, కోశాధికారి ఎం.వి.రామమూర్తి రాజు, కార్పొరేటర్ దొాలపల్లి కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 27 నుంచి ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు

మహారాణిపేట: ఆంధ్రా వైద్య కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలను అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో నిర్వహించడానికి పూర్వ వైద్య విద్యార్థులు నిర్ణయించారు. కాలేజీ ఆవరణలో ఆదివారం వైద్యుల సమావేశం జరిగింది. ఈ ఉత్సవాలకు ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎంఈ, ఇతర వైద్యులు, ఉన్నతాధికారులను ఆహ్వానించాలని నిర్ణయించినట్లు పూర్వ విద్యార్థుల సంఘం కేంద్ర కమిటీ చైర్మన్ టి.రవిరాజ్ తెలిపారు. ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్, పూర్వపు ప్రిన్సిపాళ్లు ఆర్.శశిప్రభ, పి.వి.సుధాకర్, టి.రాధ, సీనియర్ వైద్యులు ఎ.కృష్ణవేణి, కె.వి.రామ్మూర్తి కమిటీలో ఉంటారన్నారు. ఉత్సవ నిర్వహణకు సంబంధించి పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆదినారాయణ, డాక్టర్ శశిప్రభ విరాళం అందజేశారు.


చెక్కు అందజేస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆదినారాయణ, డాక్టర్ శశిప్రభ